సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

పెద్దబాణాపురం వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. పలువురు గాయపడ్డారు.

- IIలో

జిల్లాకు ఎన్నికల పరిశీలకుల రాక

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ దిగంబర్ ప్రధాన్ (ఐపీఎస్) జిల్లాకు వచ్చారు. అలాగే జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ సందీప్ కుమార్ ఐఏఎస్ కూడా జిల్లాకు చేరారు. వీరికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ జీఆర్ రాధిక స్వాగతం పలికారు.

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ఫలితాలు విడుదల

శ్రీకాకుళం: ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఫలితాలు విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ ఏడాది టెన్త్‌లో 767 మంది హాజరు కాగా 280 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇంటర్ పరీక్షకు 1,705 మంది హాజరు కాగా 561 మంది ఉత్తీర్ణత సాధించారని. రాష్ట్రంలో పదో తరగతి ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా 17వ స్థానం, ఇంటర్మీడియట్‌లో 23 వ స్థానంలో నిలిచిందని తెలిపారు.

న్యూస్‌రీల్

పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో పాలిసెట్–2024 నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పరీక్షలు నిర్వహణ కన్వీనర్, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 27న పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. గంట ముందు పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నట్లు వివరించారు. జిల్లాలో 26 పరీక్ష కేంద్రాలు విద్యార్థులకు కేటాయించినట్లు చెప్పారు. హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, కేటాయించిన పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని అన్నారు. జిల్లా నుంచి 7178 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని విద్యా సంస్థల్లో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సౌకర్యం పరీక్ష కేంద్రాలు వద్ద ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన



కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన వ్యయ పరిశీలకులు నవీన్ కుమార్ సోని

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతన కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూమ్‌ను ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం శాసన సభ నియోజకవర్గాలకు సంబంధించి వ్యయ పరిశీలకులు నవీన్ కుమార్ సోని గురువారం పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా, కంప్లైంట్ మానిటరింగ్ సెల్, సి-విజిల్స్ టీం, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్, ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్, ఎక్సైజ్ కంట్రోల్ రూం, పోలీస్‌కంట్రోల్ రూం, తదితర రూమ్‌లను ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి టి.వెంకటేశ్వరరావు, నోడల్ అధికారులు కె.చెన్నకేశవరావు, ఎం.గణపతిరావు, ఆర్.శ్రీనివాసరావు, కిరణ్ కుమార్, లక్ష్మీ ప్రసన్న, వాసుదేవరరావు, ప్రసాదరావు, చిట్టిరాజు, తదితరులు పాల్గొన్నారు.


పరిశీలకులకు ఫిర్యాదు చేయొచ్చు: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా పరిశీలకులను భారత ఎన్నికల కమిషన్ నియమించిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ చెప్పారు. ఎన్నికల్లో అభ్యర్థులు, పార్టీలు చేస్తున్న వ్యయానికి సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే పరిశీలకులను నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. అలాగే ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినా ప్రజలు, రాజకీయ పార్టీలకు చెందిన వారు కూడా ఆయా ఫోన్ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

పరిశీలకుల నంబర్లు..

- శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ అధికారి శేఖర్ విద్యార్థి 9032923131 నంబర్‌కు పార్లమెంటు పరిధిలోని ఫిర్యాదులు ఫోన్ చేసి తెలియజేయవచ్చని, అలాగే శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు సైతం కంట్రోల్ రూమ్ ద్వారా పరిష్కారం దొరకని ఫిర్యాదులు ఉంటే నేరుగా ఆయనకే ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు.
- శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి సంబంధించి అభ్యర్థుల ఖర్చు విషయంలో ఏమైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే ఐఆర్ఎస్ అధికారి కేకే శరవణ కుమార్ 81216 46161 ను సంప్రదించాలని తెలిపారు.
- ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకులు సందీప్ కుమార్ ఐఏఎస్ 9032423131 నంబర్ ద్వారా ఫిర్యాదులు తెలియజేయవచ్చని, ఇవే నియోజకవర్గాల్లో ఎన్నికల వ్యయానికి సంబంధించిన ఫిర్యాదులు ఉంటే ఐఆర్ఎస్ అధికారి నవీన్ కుమార్ సోనీకి 9030096161కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.
- ఎచ్చెర్ల నియోజకవర్గానికి మాత్రమే సంబంధించి సాధారణ ఎన్నికల ఫిర్యాదుల కోసం తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్ల ఐఏఎస్ 9030983131కు ఫోన్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.
- ఇంకా శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల, నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాలలో అభ్యర్థులు లేదా రాజకీయ పార్టీల ఎన్నికల ఖర్చుకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఐఆర్ఎస్ అధికారి నవీన్ కుమార్ సోనీ 9030096161ను సంప్రదించాలని సూచించారు.

సులభ సేద్యం



- అన్నదాతకు అండగా రైతు భరోసా
- ఐదేళ్లలో 14.89 లక్షల మందికి లబ్ధి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన ఐదేళ్లలో ఒక్కో రైతుకు రూ.67,500 అందజేత

విత్తనాలు కావాలంటే రైతు భరోసా కేంద్రాలు, నాణ్యమైన పురుగు మందులు అవసరమైతే ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, సాగు సులువుగా జరగాలంటే సబ్సిడీపై పరికరాలు, పంట విక్రయించాలంటే మళ్లీ ఆర్బీకేలు.. విత్తనం నుంచి విక్రయం వరకు అన్నదాతకు అడుగడుగునా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పంటకు పెట్టుబడి అందించడం దగ్గర నుంచి మద్దతు ధర ఇవ్వడం వరకు చిత్తశుద్ధితో సాయం చేస్తోంది. అందుకు నిఖార్సైన నిదర్శనం వైఎస్సార్ రైతు భరోసా. ఈ పథకం కింద ఐదేళ్లలో దాదాపు 15 లక్షల మంది రైతులకు గాను ఒక్కొక్కరికి రూ.67,500 సాయాన్ని ప్రభుత్వం అందజేసింది. ప్రైవేటు వడ్డీ వ్యాపారులకు రైతు బలైపోకుండా ఈ సాయం కాపాడింది.



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

ఒకనాడు భార్య పుస్తెలు తాకట్టు పెడితే గానీ రైతు దుక్కి దున్నేందుకు వీలయ్యేది కాదు. ఒకప్పుడు ఇంట్లో ఉన్న బంగారమంతా వడ్డీ వ్యాపారికి ఇస్తే గానీ సాగు మొదలయ్యేది కాదు. కానీ కాలం మారింది. వైఎస్ జగన్ ప్రభుత్వం రైతును రాజుగా మార్చింది. వడ్డీ వ్యాపారి గడప తొక్కకుండానే అన్న దాతకు పెట్టుబడి సాయం అందుతోంది. ఎవరి వద్దా అప్పు చేయకుండా పంట పండించే మార్గం దొరికింది. వైఎస్సార్ రైతు భరోసా పథకంతో ప్రభుత్వం చేసిన మేలు ఇది. డాక్టర్ వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ కింద 14.89లక్షల కుటుంబాలకు గాను రూ.1919.46 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. వాస్తవానికి ఎన్నికల హామీల్లో భాగంగా నాలుగేళ్ల పాటు ఈ సాయం అందిస్తామని అప్పట్లో వైఎస్ జగన్ ప్రకటించారు. కానీ ఐదో ఏడాది కూడా అందించి తన సహృదయతను చాటుకున్నారు.

సాయమిలా..

ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి ఆర్థిక సాయం కింద ప్రభుత్వం ఐదేళ్లలో రూ.67,500 అందించింది. ఈ పథకం కింద ఏటా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా చెల్లించే రూ.6000 లతో పాటు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.7500 లు కలిపి ప్రతి రైతు కుటుంబానికి రూ.13500 అందజేస్తున్నారు. సొంతభూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులకు (సిసిఆర్‌సి పత్రాలు కలిగిన) రైతులకు, (ఆర్ఓఎఫ్ఆర్) పట్టాలు కలిగిన రైతులకు పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వమే రూ.1350 ఆర్థిక సాయం చేస్తోంది. మొదటి విడతగా ఖరీఫ్ పంట వేసే ముందు మేలో రూ.7,500, రెండో విడతగా అక్టోబరులో ఖరీఫ్ పంట కోతకైనా/రబీ పంటల అవసరాలకైనా రూ.4000, మూడో విడతగా ధాన్యం నూర్పుల ఖర్చులకు రూ.2000 అందిస్తున్నారు.



రుణపడి ఉంటా..



గతంలో సకాలంలో రుణాలు అందించకుండా మమ్మల్ని ఇబ్బంది పెట్టేవారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఏటా మూడు విడతలుగా రైతు భరోసా సొమ్ము మా ఖాతాలకే జమ చేస్తున్నారు. దీంతో దుక్కికి, ఎరువులకు, కోతలకు చేతిలో డబ్బు ఉంటోంది. వ్యవసాయం చేసేందుకు ఏ రకమైన ఇబ్బంది లేదు. చాలా ఆనందంగా వ్యవసాయం చేసుకుంటున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితకాలం రుణపడి ఉంటా.

– కొమనాపల్లి పాపారావు, తమ్మయ్యపేటకాలనీ, జలుమూరు మండలం

అప్పులు బాధలు తప్పాయి..



అప్పట్లో సాగు ప్రారంభమయ్యే సమయానికి ప్రైవేటు వ్యక్తుల వద్దకు అప్పుల కోసం తిరిగేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అప్పు కోసం వెతుక్కోకుండానే వ్యవసాయం చేసుకోగలుగుతున్నాం. గతంలో పంట అంతా అప్పులు తీర్చడానికే సరిపోయేది. ఆ బాధల నుంచి వైఎస్సార్ రైతు భరోసా కాపాడింది. – అదాడ సింహాచలం, కిట్టాలపాడు, హిరమండలం మండలం

లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధి పొందిన కుటుంబాల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
2019–20	2,58,147	348.49
2020–21	2,91,499	393.52
2021–22	3,07,089	414.57
2022–23	3,10,346	393.16
2023–24	3,21,854	369.72
	14,88,935	1919.46కోట్లు

మా నమ్మకం నువ్వే జగన్



- జిల్లా వ్యాప్తంగా ఇదే నినాదం
- సీఎం బస్సుయాత్రతో జిల్లా వైఎస్సార్ సీపీలో కొత్త జోష్
- అక్కవరం సభ గ్రాండ్ సక్సెస్
- కేడర్‌లో రెట్టింపు ఉత్సాహం

జిల్లా అంతా ఒకటే నినాదం..

మా నమ్మకం నువ్వే జగన్. జన మందరికీ ఒకటే ఆశ.. మళ్లీ జగనే రావాలి. ఒక్క బస్సు యాత్రతో సీఎం వైఎస్ జగన్ కార్యకర్తల్లో వెయ్యి ఏనుగుల బలం నింపారు. పార్టీ క్యాడర్‌లో ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. ఎన్నికలకు ముందు పార్టీకి సరికొత్త జవజీవాలు అందజేశారు. అక్కవరం సభకు విశేష రీతిలో జనం హాజరు కావడం, బస్సు యాత్రలో అడుగడుగునా జనం నీరాజనాలు పట్టడం వంటివి వైఎస్ జగన్‌పై ఉన్న జనాదరణను మరోసారి రుజువు చేశాయి.



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర సూపర్ సక్సెస్ అయ్యింది. జనం అడుగడుగునా హారతులు పట్టి,దిష్టి తీసి, దీవెనలు అందించారు. బస్సు యాత్రగా వస్తున్న సీఎం జగన్‌కు ఎదురెళ్లి స్వాగతం పలికారు. 'నువ్వే మళ్లీ సీఎం' అంటూ నినాదాలు హోరెత్తించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, చిన్నా పెద్ద తేడా లేకుండా అభిమాన నేతను చూసి తరించారు. సెల్ఫీలు దిగి సంతోషంతో ఉప్పొంగిపోయారు. కరచాలనానికి పోటీ పడ్డారు. గుండె గుడిలో గూడు కట్టుకున్న అభిమానాన్ని, ఆత్మీయతను చూపించారు. ఈ బస్సు యాత్ర వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ నింపగా, కూటమి నేతలకు వణుకు పుట్టించింది.



మళ్లీ మీరే రావాలంటూ..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు అనూహ్య స్పందన లభించింది. సంక్షేమ పథకాలను అందుకుంటున్న లబ్ధిదారులు బస్సు యాత్రలో దారి పొడవునా జననేతకు కృతజ్ఞతలు తెలుపుతూ.. ఆప్యాయంగా పలకరిస్తూ మళ్లీ మీరే రావాలంటూ ఆకాంక్షించారు. బస్సు యాత్ర సాగినంత దూరం సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు జనం బారులు తీరారు. కొన్నిచోట్ల బస్సుకు అడ్డంగా నిలబడి ఆపేందుకు ప్రయత్నించారు. తన కోసం వేచి ఉన్న వారిని నిరాశ పరచకుండా సీఎం కూడా అదే స్థాయిలో చొరవ చూపారు. బస్సు దిగి వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారితో మాట్లాడి వారి కష్టాలు తెలుసుకున్నారు. పలుచోట్ల బస్సులో నుంచి ఆప్యాయంగా పలకరించి ముందుకు సాగారు.

విజయ సంకేతం

డబ్బు, మద్యం వెదజల్లుతూ, దగ్గరుండి వాహనాలు పెట్టి జనాన్ని తెచ్చినా పట్టుమని పావు గంట కూడా నిలబడకుండా వెళ్లిపోతున్న రోజులివి. జిల్లాలో ప్రతి చోటా టీడీపీ సభలకు, ర్యాలీలకు కష్టపడి జనాల్ని తరలిస్తుంటే... వచ్చిన వెంటనే ప్రాంగణం నుంచి వెళ్లిపోతున్న దృశ్యాలు కనిపిస్తూనే ఉన్నాయి. ఇలాంటి సందర్భంలో మండే ఎండను సైతం లెక్క చేయకుండా జనమంతా సీఎం వైఎస్ జగన్ కోసం నాలుగైదు గంటలు రోడ్డుపైనే నిలబడ్డారు. తమకు మంచి చేసిన నేతను చూడగానే ఎండ తీవ్రతను మరిచిపోయారు. ఇది విజయ సంకేతమని బస్సు యాత్రను, సభను చూసిన పరిశీలకులు చెప్పకనే చెబుతున్నారు.

పార్టీకి మరింత జోష్

వైఎస్సార్‌సీపీ ఇప్పటికే మంచి ఊపులో ఉంది. ప్రతి నియోజకవర్గంలో ప్రతి రోజూ వందలాదిగా టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. 2019కు మించి సానుకూల పరిస్థితులు కనిపిస్తుండటంతో కూటమి నుంచి వైఎస్సార్‌సీపీలోకి క్యూ కడుతున్నారు. ముఖ్యంగా టీడీపీ కీలక నాయకులు వైఎస్సార్ సీపీలో జాయిన్ అవుతున్నారు. పలాసలో సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో, ఇచ్ఛాపురంలో పిరియా విజయ ఆధ్వర్యాన శ్రీకాకుళంలో ధర్మాన ప్రసాదరావు సమక్షంలో, నరసన్నపేటలో ధర్మాన కృష్ణదాస్ నాయకత్వంలో, టెక్కలిలో పేరాడ తిలక్, దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ఆమదాలవలసలో స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యాన, ఎచ్చెర్లలో గొర్లె కిరణ్‌కుమార్, పాతపట్నంలో రెడ్డి శాంతి ఆధ్వర్యంలో ప్రతి రోజూ చేరికలు జరుగుతూనే ఉన్నాయి. అప్పటికే బలంగా ఉన్న పార్టీ చేరికలతో మరింత పటిష్టమవుతోంది. ఈ నేపథ్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర దిగ్విజయం కావడం పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. అక్కవరం సభలోనైతే జనాలను నియంత్రించడం కూడా కష్టమైపోయింది. జాతీయ రహదారి జనంతో కిటకిటలాడింది.

ఇప్పటికే సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీకి పట్టం కడుతున్నాయి. ఇప్పుడు బస్సు యాత్రకు, సభకు తరలివచ్చిన జనం, వారి స్పందన, జై జగన్ నినాదాలు..మళ్లీ నువ్వే సీఎం...మా నమ్మకం నువ్వే జగన్...మళ్లీ రావాలి ...అంటూ నినాదాలు, కేరింతలు చూసి గ్రౌండ్ రియాలిటీ అందరికీ అర్థమైంది. ఫుల్ జోష్‌తో ఎన్నికలకు సమాయత్తం అయ్యేలా మేమంతా సిద్ధం సభ, బస్సు యాత్ర ఉత్తేజాన్ని ఇచ్చింది.

కూన.. నా దగ్గర నువ్వెంత

- నువ్వు చేసిన ఆరోపణలు నిరూపించగలవా
- బహిరంగ చర్చలో నా ఎదురుగా నిలబడగలవా
- కూన రవిపై విరుచుకుపడిన స్పీకర్ తమ్మినేని సీతారాం



కూన రవికుమార్ అధికారులను బెదిరించిన వీడియో చూపిస్తూ మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: 'గూగుల్‌లో ఇసుక మాఫియా డాన్ అని సెర్చ్ చేస్తే కూన రవికుమార్ పేరు వస్తోంది.. నా దగ్గర నువ్వెంత' అంటూ స్పీకర్ తమ్మినేని సీతారాం కూన రవికుమార్‌పై విరుచుకుపడ్డారు. ఆయన గురువారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసింది వైఎస్సార్‌సీపీ అని, చంద్రబాబు ప్రేలాపనలు ఎవరూ పట్టించుకోరని తెలిపారు. తనపై చేసిన ఆరోపణలను కూన రవి నిరూపించగలరా అని సవాల్ విసిరారు. ప్రభుత్వ కార్యాలయాలకు తొగరాంలో తమ సొంత భూమిని ఇచ్చామని, కోవిడ్ కాలంలో నియోజకవర్గంలో ఉన్న పీహెచ్‌సీలకు తన తండ్రి ట్రస్ట్ ద్వారా ఆక్సిజన్ సిలిండర్లు అందజేశామని గుర్తు చేశారు. ఐదేళ్ల విప్‌గా, ఎమ్మెల్యేగా పనిచేసిన కూన రవికుమార్ ఎక్కడైనా, ఎవరికైనా ఒక పది రూపాయలు దానం చేసిన ఆనవాళ్లు ఉన్నాయా అని ప్రశ్నించారు. అధికారులను బెదిరించి, బూతులు తిట్టి వారితో కేసులు పెట్టించుకున్న ఘనుడు కూన రవి అని వీడియో, ఆడియో ఆధారాలను చూపించారు. వెన్నెలవలసలో వందెకరాలు, ఆమదాలవలసలో టీడీపీ కార్యాలయం స్థలం ఆక్రమణ, ఇసుక ర్యాంపుల్లో లారీలతో అక్రమాలు చేశాడని ఆరోపించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. మౌలిక సదుపాయాలన్నీ కల్పించామని, జనాలందరికీ తెలుసన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు దుంపల శ్యామలరావు, బి.రాజు పాల్గొన్నారు.

ఉరిమే ఉత్సాహం



నరసన్నపేట, ఇచ్ఛాపురం పట్టణాలు గురువారం దద్దరిల్లిపోయాయి. ధర్మాన కృష్ణదాస్, పిరియా విజయ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలుగా నామినేషన్లు దాఖలు చేయడంతో ఆ పార్టీ శ్రేణులు పండగలా ర్యాలీలు నిర్వహించారు. మేళతాళాలు, నృత్యాలతో జైత్రయాత్రను తలపించేలా ఊరేగింపులు నిర్వహించారు. విపక్షాల వెన్నులో వణుకు పుట్టేలా జగన్నినాదాలను మార్మోగించారు.





భారీగా తరలివచ్చిన కార్యకర్తలు అభిమానులతో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణ దాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

అట్టహాసంగా..

నరసన్నపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ధర్మాన కృష్ణదాస్ గురువారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా నరసన్నపేటలో కోలాటం డాన్సులు, తప్పెటగుళ్లు, తీన్‌మార్ డప్పు లు, డీజే డ్యాన్స్‌లతో అదరగొట్టారు. కాలేజీ రోడ్ వద్ద అభిమానులు ఏర్పాటుచేసిన గజమాలతో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను సత్కరించారు. కృష్ణదాస్ తన స్వగ్రామం మబగాం నుంచి తన కుటుంబసభ్యులతో కలసి భారీ ర్యాలీగా నరసన్నపేటకు 10 గంటల సమయంలో చేరుకున్నారు. నగరంలోనూ ర్యాలీ చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. – నరసన్నపేట



నామినేషన్ వేస్తున్న ధర్మాన కృష్ణదాస్



ఇచ్ఛాపురంలో భారీ ర్యాలీలో ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

విజయం తథ్యం అనేట్టు..

ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ గురువారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు ఇచ్ఛాపురంలో ర్యాలీలతో అదరగొట్టారు. భారీగా హాజరైన కార్యకర్తలను చూసి పట్టణమంతా పులకించిపోయింది. వేలాది మంది కార్యకర్తలు, అభిమానుల మధ్య ఆమె ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం నామినేషన్ వేశారు. – ఇచ్ఛాపురం రూరల్



నామినేషన్ వేస్తున్న పిరియా విజయ

అభ్యర్థులు 123 నామినేషన్లు 223

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో 8 అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానానికి నామినేషన్ల స్వీకరణ గురువారంతో ముగిసింది. ఈ నెల 18 నుంచి 25వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. ఎమ్మెల్యే స్థానాలకు గాను 107 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీరు మొత్తం 190 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే ఎంపీ స్థానానికి 16 మంది అభ్యర్థులు 33 సెట్ల నామినేషన్లు వేశారు. ఏడు రోజుల వ్యవధిలో వచ్చిన నామినేషన్లను 26వ తేదీన పరిశీలించనున్నారు. సంబంధిత నియోజకవర్గం ఆర్‌ఓలు ఈ పరిశీలన నిర్వహిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29 వరకు గడువు ఉంది. అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేస్తారు.

నియోజకవర్గం	నామినేషన్లు వేసిన వారి సంఖ్య	దాఖలైన నామినేషన్ సెట్ల సంఖ్య
ఇచ్ఛాపురం	13	20
పలాస	14	25
టెక్కలి	10	17
పాతపట్నం	13	24
శ్రీకాకుళం	10	25
ఆమదాలవలస	19	31
ఎచ్చెర్ల	17	28
నరసన్నపేట	11	20
ఎంపీ స్థానానికి	16	33
మొత్తం	123	223

క్లుప్తంగా

యోగా డిప్లమా కోర్సులో ప్రవేశాలకు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో యోగా డిప్లమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ పి.సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ అర్హత ఉండాలని, రూ.10 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వర్సిటీ విద్యార్థులకు 30 శాతం, బోధన, బోధనేతర సిబ్బందికి ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు యోగా కోర్సు కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.తారక రామారావు 7285913769 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జేఈఈ మెయిన్స్‌లో హర్షవర్ధన్‌కు 441వ ర్యాంకు



జి.సిగడాం: మండలంలోని బాతువ పాఠశాల ఉపాధ్యాయుడు మొయ్యి జనార్ధనరావు కుమారుడు హర్షవర్ధన్ జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 441వ ర్యాంకు, ఓబీసీ విభాగంలో 66వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. బుధవారం రాత్రి ఈ ఫలితాలు విడుదలయ్యాయి. హర్షవర్ధన్ స్వస్థలం విజయనగరం జిల్లా రేగిడి మండలం లక్ష్మీపురం. ఈ సందర్భంగా వర్షవర్ధన్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ



పెద్దబాణాపురం వద్ద ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

నందిగాం: మండలంలోని పెద్దబాణాపురం వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం నుంచి పలాస వెళ్తున్న ఆర్టీసీ ఆర్డినరీ బస్సు పెద్దబాణాపురం వద్ద ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆగింది. అదే మార్గంలో వస్తున్న లారీ బస్సును ఢీకొట్టి ఈడ్చుకెళ్లింది. దీంతో బస్సు కిటికీ అద్దాలు పగిలి ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో 60 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది. ఢీకొట్టిన లారీ నిలపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు టోల్‌గేట్ వద్ద డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయాల పాలైన వారిని 108 వాహనంలో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ప్రయాణికుల్లో ఒకరైన కిల్లి దశరథ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బూర్జ: కొల్లివలసలో ప్రచార రథంపై అభివాదం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



కాశీబుగ్గ: 14వ వార్డులో సీఎం జగన్ మాస్క్ ధరించి మంత్రి సీదిరి అప్పలరాజుతో సెల్ఫీ దిగుతున్న అభిమాని



ఎచ్చెర్ల: లావేరు మండలం గుమడాంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



టెక్కలి: సీతారాంపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్

ప్రచార పర్వం

ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు మండు టెండల్లోనూ ఇంటింటికీ వెళ్లి తమకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగిస్తామని హామీలిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: దాశరథీపురంలో మాట్లాడుతున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి..



వైఎస్సార్‌సీపీలోకి చేరిన నాయకులకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం/ఎల్.ఎన్.పేట: పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో ఎల్.ఎన్.పేట మండలం శ్యామలాపురం (ఆర్అండ్ఆర్ కాలనీ) గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యురాలు రెడ్డి శాంతి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

పార్టీలో చేరిన వారిలో శ్యామలాపురం ఆర్అండ్ఆర్ కాలనీ ఉప సర్పంచ్ రేగాన మోహనరావు, వార్డు మెంబర్ బండి రాము, మూగి గురుమూర్తి, నల్లా తవిటినాయుడు, పిసనికి రాములు, జన్ని దాలయ్య, రేగాన వైకుంఠరావు, బర్రి సవర నాయుడు, దేశుట్టి సుబ్బారావు, కిల్లాన ముకుంద రావులతో పాటు 150 కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కిల్లారి త్రినాథరావు, మండల ప్రత్యేకాహ్వానితుడు రెడ్డి రామారావు, హిరమండలం మాజీ జెడ్పీటీసీ లోలుగు లక్ష్మణరావు, ఎల్.ఎన్.పేట, హిరమండలం మండలాల పీఏసీఎస్ అధ్యక్షులు కృష్ణ, సురేష్, హిరమండలం పార్టీ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు ప్రశాంత్ కుమార్, పెనుమజ్జి విష్ణుమూర్తి, పి.మురళి తదితరులు పాల్గొన్నారు.



బద్రి కృష్ణారావు యాదవ్‌కు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 5వ వార్డు తాళ్లబద్ర గ్రామానికి చెందిన బీజేపీ నేత బద్రి కృష్ణారావు యాదవ్ వైఎస్సార్ సీపీలో చేరారు. పలాసలో డాక్టర్ సీదిరి అప్పలరాజు స్వగృహం పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మామిడి కృష్ణారావు, మామిడి తులసయ్య, డాక్టర్ కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుకు నిప్పు

- గూనాలపాడులో దుండగుల దుశ్చర్య
- అన్నదమ్ములే చేయించారంటూ యజమాని ఫిర్యాదు



బంక్‌లో దగ్ధమైన మానిటర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం పంచాయతీ గూనాలపాడు హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను బుధవారం రాత్రి 12 గంటల సమయంలో దుండగులు కాల్చేశారు. ఇలా జరగడం రెండు నెలల్లో మూడోసారి కావడం గమనార్హం. గుర్తు తెలియని వ్యక్తులు బంక్‌లోని పెట్రోల్ పంపింగ్ చేసే మానిటర్ బాక్స్‌లో పెట్రోల్ పోసి నిప్పటించారు. దీంతో మానిటర్ పూర్తిగా దగ్ధమైంది. ప్రస్తుతం బంక్ మూతపడటంతో వినియోగదారులు పెట్రోల్ కోసం అవస్థలు పడుతున్నారు. బంక్ యజమాని కొర్ల దేవీ మహాలక్ష్మీ వజ్రపుకొత్తూరు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి 12 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చి పక్కనే పార్కింగ్‌చేసి బంక్‌లోకి ప్రవేశించారని, పెట్రోల్ బాటిల్‌తో మానిటర్‌ను కాల్చివేస్తుండగా స్థానికులు వచ్చి చూసేసరికి పరుగులు తీశారని పేర్కొన్నారు. తనకు ఈ ప్రాంతంలో శత్రువులు లేరని, అన్నదమ్ములు కొర్ల రవికుమార్, కొర్ల చంద్రశేఖర్‌లతో ఆస్తి తగాదాలు కారణంగానే ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. అనంతరం దుండుగలు తెచ్చిన బైక్‌ను పోలీసులకు అప్పగించారు. ద్విచక్ర వాహనంతో పాటు బంక్‌లో ఉన్న సీసీ టీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. కాశీబుగ్గ రూరల్ సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ సీహెచ్.రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. కాగా, బంక్ ఈ ప్రాంతంలో ఉంటే తమకు ఇబ్బంది కలుగుతుందని, వేరే చోటకు తరలించాలని ఎస్ఐ రామారావుకు, తహసీల్దార్ కె.సురేష్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు.

ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి



బోల్తా పడిన ఆటో

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలో జాతీయ రహదారిపై గురువారం ఆటో బోల్తా పడటంతో డ్రైవర్ అచ్చప్పడు (48) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన సింహాచలం అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అచ్చప్పడుతో కలిసి ప్రతిరోజూ శ్రీకాకుళంలో కూరగాయలు కొని రణస్థలంలో అమ్మే వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం కూడా కూరగాయలు తీసుకెళ్తుండగా చిలకపాలెం సమీపంలో వ్యాన్ ఓవర్ టేక్ చేయబోయి ఆటోను వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, పక్కనే కూర్చున్న సింహాచలం స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే వీరిద్దరినీ శ్రీకాకుళం రిమ్స్‌కు 108 వాహనంలో తీసుకెళ్లగా డ్రైవర్ అచ్చప్పడు మృతి చెందాడు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ గురువారం తెలియజేశారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో పొందు పర్చినట్లు చెప్పారు. రెగ్యులర్ ఫలితాలను సంబంధించి బీఏ, బీబీఏ, బీసీఏ, బీకాం, బీఎస్సీ నుంచి 7186 మంది పరీక్ష రాయగా, 3337 మంది ఉత్తీర్ణత సాధించారు. 46.44 శాతం ఫలితాలు నమోదయ్యాయి. కోర్సుల వారీ పరిశీలిస్తే బీఏలో 831 కి 342, బీబీఏలో 118 కి 100, బీసీఏలో 193కి 175, బీకాంలో 1234 కి 524, బీఎస్సీలో 4810 కి 2196 మంది ఉత్తీర్ణత సాధించారు.

1న మహిళలకు వంటలు, ముగ్గుల పోటీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా మే 1న శ్రీకాకుళం పురపాలకోన్నత పాఠశాల మైదానంలో మహిళలకు ముగ్గులు, వంటల పోటీలు (మిల్లెట్స్ చిరుధాన్యాలు) నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు రిజిస్ట్రేషన్, 3 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని మహిళలు అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

నిజాయితీగా ఓటు వేసే అంశంపై ముగ్గు వేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వ్యక్తిగత, బృందం విభాగాల్లో పోటీలు జరుగుతాయని, రాజకీయ గుర్తులు, జెండాల ప్రస్తావన ఉండకూడదని స్పష్టం చేశారు. సామగ్రి మహిళలే తెచ్చుకోవాలని సూచించారు. వండిన వంటలు ప్రదర్శన చేయాలని పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి



శ్రీనివాసరావు(ఫైల్)

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి పంచాయతీ సీతమ్మపేట వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్మీడియెట్ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీపుర్లపాడు పంచాయతీ దుర్గంపేటకు చెందిన శిదపాన యర్రన్న, నర్సమ్మల పెద్దకుమారుడు శ్రీనివాసరావు(17) బైక్‌పై కోటబొమ్మాళిలోని బజారుకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా సీతన్నపేట వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాసరావు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాసరావు కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాడు. ఇంతలో ఆకస్మిక మృతి చెందడంతో విషాదఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ లక్ష్మణరావు తెలిపారు.

కామేశ్వరిపేట.. అభివృద్ధి బాట

ఊరు మారింది



రూ.40 లక్షలతో నిర్మితమైన గ్రామ సచివాలయం

- అర్హులందరికీ పక్కా ఇళ్లు
- పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు
- డీబీటీలో 4669 మందికి రూ.12.89 కోట్లు పంపిణీ
- నాన్ డీబీటీ లో 1104 మందికి రూ.3.49 కోట్లు ప్రయోజనం

నరసన్నపేట: మండల కేంద్రానికి సుదూరంగా ఉన్న కామేశ్వరిపేట పంచాయతీ ఒకప్పుడు అభివృద్ధికి కూడా ఆమడదూరంలో ఉండేది. ముఖ్యంగా టీడీపీ పాలనలో కనీస మౌలిక సదుపాయాలు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామం రూపురేఖలు మారాయి.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో స్థానిక ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ చొరవతో కామేశ్వరిపేట దశ తిరిగింది. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు వంటివి ఏర్పాటై పౌరసేవలు సులభతరమయ్యాయి. నడగాం–కామేశ్వరిపేట మధ్య రూ.2 కోట్లతో రోడ్డు, కామేశ్వరిపేట నుంచి వెంకటాపురం, కొబగాం మీదుగా ముద్దాడపేట వరకూ రూ.2 కోట్లతో శాశ్వత రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇవి కాక జగనన్న లే అవుట్‌లో స్థలాలు, 27 మందికి పక్కా ఇళ్లు, జలజీవన్ మిషన్ నిధులు రూ.22.40 లక్షలతో ఇంటింటా కుళాయిలు, అనుబంధ గ్రామమైన కొల్లవానిపేట ప్రాథమిక పాఠశాల రూ. 36 లక్షలు , నర్సింగరాయుడుపేట ప్రాథమికోన్నత పాఠశాలలను రూ. 8 లక్షలతో అభివృద్ధి చేశారు.



రూ.22.10 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం



రూ. 17.50 లక్షలతో నిర్మాణమైన వైఎస్సార్ హెల్త్ క్లినిక్



జలజీవన్ మిషన్ నిధులతో నిర్మితమైన రక్షిత మంచినీటి ట్యాంకు



నర్సింగరాయుడుపేటలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనం



రూ.2 కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారి